



# టాక్ షో కథలు

## – కిరణ్ ప్రభ

గత పది సంవత్సరాలుగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న లక్షలాదిమంది తెలుగువారిని అలరిస్తున్న కిరణ్ ప్రభ టాక్ షోలు, యు ట్యూబ్ లో 500 పైగా ఉన్న విషయం కౌముది పాఠకులకు తెలుసనే అనుకుంటున్నాము. కొంతమంది పాఠకులు ఆ టాక్ షోలకు అక్షరరూపం ఇస్తే బాగుంటుందని అడుగుతున్నారు. వారి సూచనలమేరకు ఆ టాక్ షోల నుంచి ఎంపికచేసిన కొన్నింటిని నెలనెలా ఇలా అక్షరరూపంలో మీకందిస్తున్నాము. ఈ టాక్ షోలను విని, వీటిని అక్షరీకరించిన వారు శ్రీ బొడ్డు సత్యనారాయణ(హైదరాబాదు). వారికి కృతజ్ఞతలు తెలియచేస్తూ, ఈ ప్రయోగం కౌముది పాఠకులకు నచ్చుతుందని ఆశిస్తున్నాము.

# టంగుటూరి సూర్యకుమారి

## మొదటి భాగం



ఈ రోజు ఒక విశిష్టమైన తెలుగు మహిళను మీకు పరిచయం చేస్తాను.ఈ విశిష్ట తెలుగు మహిళ తెలుగు సినిమా ప్రారంభమైన తొలిరోజుల్లో బాలనటిగా సినీరంగ ప్రవేశం చేసి ఆ తర్వాత చాలా సినిమాల్లో ముఖ్య పాత్రల్లోనూ కథానాయికగానూ నటించారు. 1938 –1955 ఆ మధ్యలో ఈమె దాదాపుగా 25 చిత్రాల్లో నటించారు. అయితే, నటిగా కంటే గాయనిగానే ఆమె ఎక్కువ పేరు తెచ్చుకున్నారు. ఇప్పటికి కూడా ఆవిడ పేరు చెప్పగానే గాయనిగానే చాలామంది గుర్తుపెట్టుకున్నారు. ఈ రోజుకు కూడా ఒక పాట చెబితే, ఆవిడ పేరు వెంటనే గుర్తొస్తుంది. ఆ పాట ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గీతం కూడా. ఈ పాటతో పాటుగా ఆ రోజుల్లో ఆమె అనేక లలిత గీతాలను, దేశభక్తి గీతాలను గ్రామఫోన్ రికార్డులుగా ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ రూపుదిద్దుకొనకముందు మద్రాసు రాష్ట్రంలో భాగంగా ఉన్నప్పుడు ఆంధ్రరాష్ట్రానికి మొట్టమొదటి ముఖ్యమంత్రిగా సేవలందించిన, తెలుగు వాడి పౌరుషానికి ప్రతిరూపంగా నిలిచిన ఓ ప్రముఖ రాజకీయ నాయకుడికి తమ్ముడిగారమ్మాయి.

ఆ విశిష్ట తెలుగు మహిళ టంగుటూరి సూర్యకుమారి గారు. ఈమె అసలు పేరు టంగుటూరి సూర్యప్రకాశమ్మ.అందరికి తెలిసిన పేరు టంగుటూరి సూర్యకుమారి. సన్నిహితులు ఆత్మీయంగా పిలుచుకున్న పేరు సూర్య. ఈ సూర్య తెలుగు తల్లికి మల్లెపూదండ. ప్రాచ్య పాశ్చాత్య సాంస్కృతిక వారధి. మా తెలుగు తల్లికి మల్లెపూదండ అనగానే గుర్తొచ్చే పేరు టంగుటూరి సూర్యకుమారి గారు. ఆమెను తలుచుకోగానే గుర్తొచ్చే పాట మా తెలుగు తల్లికి మల్లెపూదండ. టంగుటూరి సూర్యకుమారి గారు చలన చిత్ర నటి, గాయని, రంగస్థలనటి, నృత్య కళాకారిణి. మొట్టమొదటగా మిస్ మద్రాస్ గౌరవాన్ని అందుకొన్న అద్భుత సౌందర్యరాశి. సంపన్న కుటుంబంలో పుట్టిన అలనాటి అమ్మాయి ఇన్ని రంగాల్లో ప్రావీణ్యత సంపాదించడం తన ప్రావీణ్యతని విదేశీ గడ్డమీద ప్రాచుర్యంలోకి తీసుకురావడం ఇవన్నీ కూడా ఆ రోజుల్లోనే టంగుటూరి సూర్యకుమారి గారు సాధించిన ప్రత్యేకతలకి, విశిష్టతలకి ఉదాహరణలు.

టంగుటూరి సూర్యకుమారి గారి జీవితాన్ని విహంగవీక్షణంలా చూసినట్లయితే, ఆవిడ తెలుగు సినిమా రంగంలో దాదాపుగా 15 సంవత్సరాలు ఉన్నారు.అమెరికాలో సుమారుగా 5 సంవత్సరాలు ఉన్నారు. కొంచెం ఒకటి రెండు సంవత్సరాలు అటూ ఇటూ అవ్వొచ్చు..అందుకనే దాదాపుగా, సుమారుగా అంటున్నాను. తన జీవితంలోని రెండవ అర్ధభాగం అంటే దాదాపుగా నలభై సంవత్సరాలు ఇంగ్లాండులోనే గడిపిన టంగుటూరి సూర్యకుమారి గారి జీవితం అడుగడుగునా ఆసక్తి దాయకం, అంతకు మించిన స్ఫూర్తిదాయకం కూడా. ఆ రోజుల్లో కేవలం ప్రజ్ఞా పాటవాలు ఉండడమే కాకుండా వివిధ రంగాల్లోకి చొచ్చుకెళ్లిన ఆమె ధైర్యసాహసాలకు కూడా సూర్యకుమారి గారిని మనం ఈ రోజుకు కూడా గుర్తుపెట్టుకోవాలి,గుర్తు తెచ్చుకోవాలి. భారతదేశ స్వాతంత్ర్య పోరాటం చివరిదశలో ఉన్నప్పుడు వాళ్ళ పెదనాన్నగారు టంగుటూరి ప్రకాశం గారితో కలిసి రాజకీయ వేదికలమీద నిల్చొని ఆమె పాడిన దేశభక్తిగీతాలు, ఆ రోజుల్లో విపరీతమైన సంచలనాలు సృష్టించాయి.

టంగుటూరి సూర్యకుమారి గారి ప్రత్యేకతలు కొన్ని చెప్పుకోవాలంటే

సినీ రంగంలోనూ నటిస్తూ కూడా లలితగేయ రంగంలో సెలెబ్రెటీగా పేరు తెచ్చుకొన్న తెలుగు యువతి టంగుటూరి సూర్యకుమారి.

మిస్ మద్రాసుగా ఎంపికైన మొట్టమొదటి తెలుగు యువతి టంగుటూరి సూర్యకుమారిగారు.

మిస్ ఇండియా పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచిన మొట్టమొదటి తెలుగు యువతి టంగుటూరి సూర్యకుమారి గారు.

హాలీవుడ్ ప్రముఖులతో ప్రత్యక్షంగా ప్రసంశలు పొందిన మొట్టమొదటి తెలుగు యువతి టంగుటూరి సూర్యకుమారి గారు.

హాలీవుడ్ ప్రముఖులకు తెలుగు పాట రుచి చూపించిన మొట్టమొదటి తెలుగు యువతి టంగుటూరి సూర్యకుమారి గారు.

ప్రముఖ హాలీవుడ్ దర్శకుడు హిచ్ కాక్ కి కథా విభాగంలో పనిచేసిన మొట్టమొదటి తెలుగు యువతి టంగుటూరి సూర్యకుమారి గారు.

న్యూయార్క్ అఫ్ బ్రాడ్ వే లో వారానికి ఎనిమిది ప్రదర్శనల చొప్పున పదినెలలపాటు కొనసాగిన ఒక ఆంగ్లనాటకంలో ప్రధాన పాత్ర ధరించి ఉత్తమ నటిగా బహుమతి పొందిన మొట్టమొదటి తెలుగు యువతి టంగుటూరి సూర్యకుమారి గారు.

లైఫ్ మ్యాగజైన్ లో పూర్తి పేజీ రంగుల చిత్రం ముద్రించబడిన మొట్టమొదటి తెలుగు యువతి టంగుటూరి సూర్యకుమారి గారు.

కొలంబియా యూనివర్సిటీలో భారతీయ సంగీతాన్ని, నృత్యాన్ని బోధించిన మొట్టమొదటి తెలుగు యువతి టంగుటూరి సూర్యకుమారిగారు.

లండన్ లో ఈ భారతీయ నృత్య, సంగీత శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించి 40 సంవత్సరాలు నడిపిన మొట్టమొదటి తెలుగు యువతి టంగుటూరి సూర్యకుమారి గారు.

ఇలా టంగుటూరి సూర్యకుమారిగారి ప్రత్యేకతలు చెప్పుకోవాలంటే చాలా ఉన్నాయి.ఇప్పటివరకు మీకు చెప్పింది కేవలం విహంగ వీక్షణం లాంటి సూర్యకుమారి గారి జీవితం మీద ఒక చిన్న ఫోకస్ లైట్ అంతే. నిజానికి ఇన్ని సాధించినటువంటి టంగుటూరి సూర్యకుమారి గారు ఎక్కడ బయలుదేరారు, ఎలా ప్రయాణించారు, ఇన్ని దేశాలు ఎలా తిరిగారు ఇంతమందితో ఎలా పరిచయాలున్నాయి, అంత చొరవ, ధైర్యసాహసాలు, పట్టుదల ఆమెకు ఎక్కడినుంచి వచ్చాయి – ఇవన్నీ తెలుసుకుంటే ఆమె జీవితం అడుగడుగునా స్ఫూర్తిదాయకం అనడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు.

టంగుటూరి సూర్యకుమారి గారి జీవిత విశేషాలు చాలా అరుదుగా లభ్యమౌతున్నాయి. ఆమె చనిపోయాక ఇంగ్లాండ్ లోని తెలుగు ప్రముఖులు గూటాల కృష్ణమూర్తి గారు, టంగుటూరి సూర్యకుమారి గురించి నటువంటి వివిధ వ్యక్తులు రాసిన వ్యాసాలని, అలాగే అరుదైన సమాచారాన్ని, ఆయనకున్న పరిచయంలో ఆయనకు తెలిసిన విశేషాలను ఇవన్నీ కలిపి ఒక చక్కని పుస్తకంగా ముద్రించారు 2006 ప్రాంతంల్లో. కాకపోతే,దాని వెల

చాలా అధికంగా ఉండడము, చాలా తక్కువ ప్రతులు మాత్రమే ముద్రించడము వల్ల అది ఎక్కువ మందికి చేరలేదు. టంగుటూరి సూర్యకుమారి గారి గురించిన కార్యాక్రమం చేద్దామనుకున్నప్పుడు 1940 ,45 ,50 ఆ ప్రాంతాల్లో ఉన్నటువంటి కొన్ని పత్రికల్లో వ్యాసాలూ లభించాయి.ఈ పుస్తకం ఉంటె గనక ఇంకా సమగ్రమైన విశేషాలు దొరుకుతాయన్న ఉద్దేశ్యం తో దానికోసం ప్రయత్నించాను గాని నా దగ్గర ఆ పుస్తకం లేదు. ఆ క్రమంలో ఆ పుస్తకంలోని విశేషాలు, ఇంకా ప్రత్యేకమైనటువంటి విశేషాలు సేకరించేటటువంటి క్రమంలో నాకు చాలామంది సహాయం చేశారు. కార్యక్రమం ప్రారంభించబోయే ముందు వాళ్లకు కృతజ్ఞతలు తెలియ చేయడం నా బాధ్యతగా భావిస్తున్నాను.

ముందుగా ఈ టంగుటూరి సూర్యకుమారి గారి గురించినటువంటి ప్రత్యేకపుస్తకం లండన్ లో ప్రచురితమైనప్పటికీ దానికి అమెరికా నుంచి చాలా సమాచారాన్ని అందించినటువంటి వంగూరి చిట్టెన్ రాజు గారు, ఆ పుస్తకంలో చాలా పేజీలు నేను అడగ్గానే నాకు కాపీ తీసి పంపించారు. అలాగే శాన్ ఆంటోనియోలో ఉంటున్నారు, దేవా గుప్తపు బాబు గారు అని, ఆయన టంగుటూరి సూర్యకుమారి గారి అక్కయ్యగారి అబ్బాయి.,ఈ దేవాగుప్తపు బాబు గారి అమ్మగారి ఇంట్లోనే టంగుటూరి సూర్యకుమారి గారు చిన్నప్పట్లో చాలా రోజులు ఉండి, సినిమాల్లో నటించినప్పుడు కూడా వాళ్లింట్లోనే ఉన్నారు. చిన్నప్పటినుంచి సూర్యకుమారిగారిని పెద్దక్కయ్య అని పిలిచే దేవాగుప్తపు బాబు గారు ప్రస్తుతం 80 సంవత్సరాల వయసు. ఆయన చాలా ఓపికగా నాకు గంటల తరబడి సూర్యకుమారి గారి గురించి విశేషాలు ప్రత్యేకంగా తెలియచేసారు. ఆయనకు కూడా కృతజ్ఞతలు తెలియచేయాలి. అలాగే లండన్ లో ఉంటున్నటువంటి మరొక ఇద్దరు తెలుగు ప్రముఖులు డా.వివేకానంద మూర్తి గారు, అలాగే పరుచూరి శ్రీనివాస్. వీళ్ళిద్దరూ కూడా లండన్ నుంచి చాలాసేపు మాట్లాడి, టంగుటూరి సూర్యకుమారి గురించినటువంటి ప్రత్యేకమైన విషయాలు అందించారు. వీళ్ళందించిన విశేషాలూ,ఆ పుస్తకంలోని కొన్ని పేజీలూ,పాత పత్రికల్లోని కొన్ని విశేషాలూ ఇవన్నీ కలిసి వీలయినంత సాధికారికమైన సమాచారాన్ని టంగుటూరి సూర్యకుమారి గారి గురించి మీకు తెలియజేసే ప్రయత్నం చేస్తున్నాను.

టంగుటూరి సూర్యకుమారి గారి గురించి మాట్లాడుకోవాలంటే మనం బయల్దేరాల్సింది టంగుటూరి ప్రకాశం గారి దగ్గర. ఆయన గురించి ఇంకా ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు కదా! నిజంగా ఆయన జీవితమే అత్యంత స్ఫూర్తిదాయకం. టంగుటూరి ప్రకాశం పంతులు గారి గురించి కూడా అతి త్వరలో మాట్లాడుకుందాం చాలా విశేషాలు. ఆయనకి ఇద్దరు అక్కయ్యలు, ఇద్దరు తమ్ముళ్లు, ఒక చెల్లి. టంగుటూరి ప్రకాశం పంతులు గారి చిన్న తమ్ముడు పేరు జానకి రామయ్య. ఆయన లండన్ లో డాక్టర్ చదువుకున్నారు. కాకపోతే, భారతదేశం వచ్చాక అలోపతి వైద్యం కంటే కూడా హోమియోపతి వైద్యం వైపు ఆయన ఎక్కువ ఆకర్షితుడై, ఆ రంగంలో ఎక్కువ పేరు తెచ్చుకున్నారు. ఆ ప్రాక్టీస్ చేసేటటువంటి క్రమంలో టంగుటూరి ప్రకాశం పంతులు గారి చిన్న తమ్ముడు జానకి రామయ్య గారు మద్రాసులో స్థిరపడ్డారు. టంగుటూరి ప్రకాశం పంతులు గారు కూడా లండన్ వెళ్లి బారిస్టర్ చదువుకోవడం తోటి ఆయన వెనక్కు వచ్చాక సంఘ బహిష్కరణ చేశారు, ఆ చుట్టుపక్కల వున్నవాళ్ళందరూ. ఆ కారణం వల్ల ఆయన కూడా మద్రాసు వెళ్ళిపోయి అక్కడ వకీలుగా ఆయన ప్రాక్టీస్ ప్రారంభించారు.

ఈ విధంగా టంగుటూరి ప్రకాశం పంతులు గారు, చిన్న తమ్ముడు జానకి రామయ్యగారు గారు మద్రాసులో స్థిరపడగా, టంగుటూరి ప్రకాశం పంతులు గారి పెద్ద తమ్ముడు అంటే మధ్యలో ఉన్నాయన ఆయన పేరు శ్రీరాములు గారు. ఆయన రాజమండ్రిలోనే వకీలు వృత్తిలో స్థిరపడ్డారు. ఆయన భార్య రాజేశ్వరి గారు శ్రీరాములు గారి గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలంటే , ఆయనకి చాలా పేరుండేది ఆ రోజుల్లో వకీలుగా. ఎందుకంటే ఏ కేసు బడితే ఆ కేసు తీసుకొని వాదించడం కాకుండా నిజంగా వచ్చినటువంటి పార్టీ నిజాయితీగా ఉన్నవాళ్లు దాంట్లో నేరప్రవృత్తి లేనివాళ్లు అయితేనే అలాంటి కేసులు మాత్రమే తీసుకొని వాదిస్తూ ఉండేవాళ్ళు టంగుటూరి శ్రీరాములు గారు. అలాగే ఆ రోజుల్లోనే చాలా అభ్యుదయ భావాలున్నటువంటి వ్యక్తి, ఆంగ్లభాషలో విపరీతమైన ప్రావీణ్యముండేది. ఆయన ఆ రోజుల్లో బ్రహ్మసమాజ సూత్రాల్ని ఎక్కువగా పాటిస్తూ, బ్రహ్మసమాజం ఆ సిద్ధాంతల్ని ఎక్కువగా ప్రచారం చేస్తూ ఉండేవాళ్ళు. ఆయన కార్లీలీన్ అనేటటువంటి ఒక ఆంగ్ల పత్రికను కూడా నడిపారు. కందుకూరి వీరేశలింగం గారి పత్రిక వివేకవర్ధినికి కూడా కొంతకాలం సంపాదకులుగా ఉన్నారు. అలాగే వాళ్ళ అన్నయ్య టంగుటూరి ప్రకాశం పంతులు గారు నడిపినటువంటి ఒక పత్రిక కు కూడా కొంతకాలం సంపాదకులుగా ఉన్నారు. ఇవన్నీ కూడా టంగుటూరి శ్రీరాములు గారి యొక్క ప్రత్యేకతలు. ఇదంతా కూడా 1915 –20 ప్రాంతాల్లో.

ఆ టంగుటూరి శ్రీరాములు గారికి ఆరుగురు సంతానం. ఆ ఆరుగురు సంతానంలో చిట్టచివరి అమ్మాయి పేరు సూర్యప్రకాశమ్మ. బహుశా ఆ పెదనాన్న గారి పేరు టంగుటూరి ప్రకాశం పంతులు గారి పేరు కలిసి వచ్చేటట్లు గా ఆ చిన్న పాప కి సూర్యప్రకాశమ్మ అని పేరు పెట్టారేమో. ఆవిడ

జన్మించింది 1925 నవంబర్. కొన్ని చోట్ల 1926 అని రాస్తారు. కానీ వాళ్ళ అక్కయ్యగారి అబ్బాయి చెప్పిన దాని ప్రకారం 1925 నవంబర్లో జన్మించారు సూర్యప్రకాశమ్మ గారు. ఆ సూర్యప్రకాశమ్మ గారే ఈనాటి మన కథానాయిక టంగుటూరి సూర్యకుమారి గారు. టంగుటూరి సూర్యకుమారి గారికి ముగ్గురు అన్నయ్యలు, ఇద్దరు అక్కయ్యలు ఉన్నారు. ఈ ముగ్గురు అన్నయ్యల్లో అందరికంటే పెద్దాయన పేరు గోపాలకృష్ణా రావు. ఆయన ఆ రోజుల్లోనే మద్రాసు లో ఫైర్ సర్వీస్ లో పోలీస్ ఆఫీసర్ గా పనిచేసేవాళ్ళు. చాలాకాలం దాంట్లో పనిచేసాక చిట్టచివర్లో ఆయన పబ్లిక సర్వీస్ కమీషన్ చైర్మన్ గా కూడా పనిచేశారు. మిగతా ఇద్దరన్నయ్యల్లో ఒక అన్నయ్య పేరు అచ్యుత రామారావు. ఆయన్ను టెన్నిస్ రామారావు అనికూడా అంటూ ఉండేవాళ్ళు. ఆయన ఆ రోజుల్లోనే టెన్నిస్ కోచ్ గా పనిచేస్తూ ఉండేవాళ్ళు. ఈ అశోక్ అమృత్ రాజ్, విజయ్ అమృత్ రాజ్ సోదరులకు, అలాగే రామనాథ్ కృష్ణన్ ఇలాంటి వాళ్లందరికీ కూడా కోచింగ్ ఇచ్చినటువంటి ప్రముఖుడు ఈ టెన్నిస్ రామారావు గారు. టంగుటూరి సూర్యకుమారి గారి ఇంకొక అన్నయ్య రాజా రామ్మోహన్ రావు . రాజా రామ్మోహన్ రాయ్ గారి పేరు మీద రాజా రామ్మోహన్ రావు పేరు పెట్టుకున్నారు. రామ్మోహన్ అని చాలా చోట్ల టంగుటూరి సూర్య కుమారి గారు రాసుకున్నారు. ఆయనకి చిన్నప్పట్నుంచి కూడా సంగీతమంటే చాలా ఆసక్తి. ముఖ్యంగా ఈ హార్మోనియం బాగా అభ్యాసం చేస్తూ ఉండేవాడాయన. మౌత్ ఆర్గాన్ కూడా. ఆయన చిన్నప్పటినుంచి సంగీతాన్ని అభ్యసించడమే కాకుండా తర్వాత రోజుల్లో కూడా సంగీత శిక్షణని కొనసాగించి ఒక సినిమాకి సంగీత దర్శకత్వం కూడా వహించారు. కానీ ఆ సినిమా రిలీజ్ కాలేదు. వీళ్ళు ముగ్గురూ టంగుటూరి సూర్యకుమారి గారి ముగ్గురు అన్నయ్యలు. అయితే, ఈ టెన్నిస్ రామారావు గారు, అలాగే గాయకుడైనటువంటి రామ్మోహన్ రావు గారు, ఇద్దరూ కూడా వివాహం చేసుకోలేదు జీవితాంతం. టంగుటూరి సూర్యకుమారిగారు సినీ నటిగానూ, గాయనిగానూ చాలా ఉచ్చస్థితిలో ఉన్నప్పుడు అక్కడే ఉండేవాళ్ళు ఈ అన్నదమ్ములు కూడాను.

టంగుటూరి సూర్యకుమారి గారి పెద్దక్కయ్య పేరు సావిత్రి గారు. వాళ్ళ అబ్బాయే సాన్ ఆంటానియాలో ఉన్నటువండి దేవాగుప్తపు బాబు గారు. సావిత్రి గారి భర్త పేరు సూర్యప్రకాశరావు గారు. ఆ రోజుల్లో అంటే 1925 –30 ప్రాంతాల్లో ఈ సూర్యప్రకాశరావు గారు మద్రాసు లో లాయర్ గా పనిచేస్తూ ఉండేవాళ్ళు. ఆయన లాయర్ గా కాపీ రైట్ ఆక్ట్ లాంటి దాంట్లో చాలా ఆయనకు అనుభవముండేది. అందుకని సూర్యప్రకాశరావు గారికి సినిమా వాళ్ళందరూ , సినిమా నిర్మాణసంస్థలు ఇవన్నీ కూడా ఆయన క్లైంట్స్. అప్పట్లోనే ఉన్న జెమినీ సంస్థ, తర్వాత ప్రారంభమైనటువంటి విజయా సంస్థ అలాగే బొంబాయిలో ఉన్నటువంటి రాజశ్రీ సంస్థ – వీళ్ళందరూ కూడా సూర్యప్రకాశరావు గారి దగ్గరికి వస్తూ ఉండేవాళ్ళు. అలాగే తమిళ పరిశ్రమ నుంచి కూడా చాలామంది ప్రముఖులు సూర్యప్రకాశరావు గారికి క్లైంట్స్ గా ఉండేవాళ్ళు. టంగుటూరి సూర్యకుమారి గారి ఇంకొక అక్కయ్య అంటే చిన్నక్కయ్య పేరు పుష్పావతి.ఈ చిన్నక్కయ్యగారి అబ్బాయే కరుణామయుడుగా పేరు తెచ్చుకున్న విజయ చందర్ గారు. ఇది సూర్యకుమారి గారి యొక్క ఇద్దరు అక్కయ్యలు, ముగ్గురు అన్నయ్యల గురించిన సమాచారం.

చిట్ట చివరి అమ్మాయి, శ్రీరాములుగారి ఆరవ సంతానం టంగుటూరి సూర్యకుమారి గారు. ఇంకోవిధంగా చూసుకుంటే, టంగుటూరి సూర్యకుమారిగారి అమ్మగారి తరఫు నుంచి అంటే, రాజేశ్వరి గారి తరఫు నుంచి డా.ఎల్లాప్రగడ సుబ్బారావుగారి అన్నయ్యగారికి బంధుత్వం ఉంది. కాకపోతే సూర్యకుమారి గారు, ఎల్లాప్రగడ సుబ్బారావు గారు కలుసుకునేటటువంటి అవకాశం ఏమాత్రం లేదు. సూర్యకుమారి గారు పుట్టింది 1925 లో, ఎల్లాప్రగడ సుబ్బారావు గారు అప్పటికే భారతదేశ వదిలేసి అమెరికా వచ్చేశారు. ఆ తర్వాత ఆయన అమెరికాలోనే మరణించారు. అప్పటికి సూర్యకుమారి గారు ఇంకా భారతదేశంలోనే ఉన్నారు. అందుకని చాలా చోట్ల సూర్యకుమారి గారి ప్రసక్తి వచ్చినప్పుడు ఆమెకు మేనమామ అవుతాడు అని రాశారు.కానీ వాళ్లిద్దరూ కలుసుకున్నటువంటి సందర్భాలు మాత్రం లేదు. ఇదండీ! ఇదంతా టంగుటూరి సూర్యకుమారి గారి యొక్క అన్నయ్యల గురించి, అక్కయ్యల గురించిన సమాచారం.

ఎందుకు చెప్పానంటే,టంగుటూరి సూర్యకుమారి గారి జీవితంలో వీళ్ళందరూ కూడా మనకు అక్కడక్కడా కనిపిస్తూ ఉంటారు.ముఖ్యంగా టంగుటూరి సూర్యకుమారి గారి అక్కయ్య సావిత్రి గారు. వాళ్ళ విశేషాలు.. ఇంకా ఈమె సినిమాల్లోకి చేరబోయే విశేషాల్లోకి రాబోయే ముందు.. ఆవిడ బాల్యం గురించి తెలుసుకుందాం. టంగుటూరి సూర్యకుమారిగారు ఒక విధంగా మాటలతోటే పాటలు నేర్చుకున్నారని చెప్పుకోవచ్చు. అంటే, ఆవిడకు మాట్లాడ్డం వయసు వచ్చేటప్పటికేపాటలు పాడేసేశారు. దాదాపుగా మాటలే పాటలుగా వచ్చేశాయి. నాలుగైదు సంవత్సరాలకే ఆవిడ అలవోకగా పాటలు పాడుతుండేవాళ్లు, ఎక్కడా నేర్చుకున్నది కాదు. వాళ్ళ అన్నయ్యగారు, ఈవిడ కంటే నాలుగైదు సంవత్సరాలు పెద్దైనటువంటి

రామ్మోహన్ గారు, మాత్రం పాటలు పాడుతూ ఉండే వాళ్ళు. ఆ రోజుల్లో సినిమా పాటలు లేవు.ఎందుకంటే ఈవిడ 1925 లో జన్మిస్తే, 1930 కి ఇంకా సినిమా పాటలు రాలేదు. కాకపోతే, ప్రైవేట్ రికార్డులుండేవి. గ్రామఫోన్ రికార్డులు. స్థానం నరసింహారావు గారు, కపిలవాయి రామనాధ శాస్త్రి గారు, ఇలాంటి వాళ్ళు పాడినవి. ఆ గ్రామఫోన్ రికార్డులు విని టంగుటూరి సూర్యకుమారి గారి అన్నయ్య గారు రామ్మోహన్ గారు బాగా పాడుతూ ఉండేవాళ్ళు ఇంట్లో. బహుశా ఆ వాతావరణంలో జన్మించడంవల్ల ఏమో గాని టంగుటూరి సూర్యకుమారి గారికి చాలా చిన్నతనం నుంచే తనంతట తానుగా పాటలు పాడేటటువంటి ఆ అలవాటు మొదలైంది.

ఎట్లా ఉండేదంటే, కొన్ని ఉదాహరణలు. వాళ్ళమ్మగారు ఈ పాప చిన్నప్పుడే పాటలు పాడుతుంటే, నాలుగైదు సంవత్సరాల వయసులో "ఏమిటే నువ్వు కోయిలలా పాటలు పాడుతున్నావు!" అన్నారట. అప్పుడు సూర్యకుమారి గారు "కోయిల అంటే ఏమిటమ్మా?" అని అడిగితే, వాళ్ళమ్మ "ఆ కొమ్మల్లో ఉంటుంది. అక్కడే కూర్చుని పాడుతుంది" అనగానే అంత చిన్న పిల్ల కూడా చెట్టెక్కి కొమ్మలమీద కూచుని అక్కడినుంచే పాడటం ప్రారంభించిందట కాళ్ళూపుకుంటూ. దోవలో వెళ్ళేవాళ్ళందరూ "పడిపోతావు దిగు.." అంటే "లేదు లేదు నేను కోయిలని అందుకే ఇక్కడ కూచుని పాడుతున్నాను" అంటూ ఉండేవాళ్ళట. ఇంకొక ఉదాహరణ – ఆవిడకు ఐదారు సంవత్సరాల వయసున్నప్పుడు రాజమండ్రి లో డా.శివరాజు రామారావు గారని వాళ్ళమ్మాయి వివాహమవుతోంది. ఆ రోజుల్లో వివాహమంటే ఐదురోజులు వివాహముండేది .మధ్య మధ్యలో ఊరేగుతూ ఉండేవాళ్ళు. .ఆ శివరాజు రామారావు గారి అమ్మాయి వివాహమైనప్పుడు ట్రాక్టర్ లో అందరూ ఊరేగుతున్నారు. ఒక ఇరవై ఏళ్ళ అబ్బాయి ఇద్దరు చిన్న పిల్లల్ని అటూ ఇటూ కూర్చోబెట్టుకుని వాళ్లకు పాటల పోటీ పెట్టాడు. ఆ ఇద్దరు చిన్నపిల్లల్లో ఒక అమ్మాయికి తొమ్మిదేళ్ల వయసు, ఇంకో అమ్మాయికి ఆరేళ్ళ వయసు. వాళ్లిద్దరూ కూడా బాలమేధావులే. వాళ్ళంతట వాళ్ళు నేర్చుకున్నవాళ్ళే. ఒకళ్ళు ఒక పాట పాడుతుంటే , రెండోళ్ళు రెండో పాట ఆ మధ్యలో కూర్చున్న ఇరవై ఏళ్ళ కుర్రవాడు ఇద్దర్నీ కూడా పాటలు పాడమని ప్రోత్సహిస్తున్నాడు. ఆ పాటలు కూడా మరి సినిమా పాటలు కాదు కదా అప్పట్లో ఉన్నవి కీర్తనలు , ఇలాంటి పాటలే. ఆ ఇద్దరూ పిల్లల్లో ఆ పదేళ్ల అమ్మాయేమో వింజమూరి అనసూయాదేవి గారు, ఆరేళ్ళ పాపేమో మన టంగుటూరి సూర్యకుమారి గారు.వాళ్ళిద్దరికీ పాటల పోటీ పెట్టిన కుర్రవాడు ప్రముఖ రచయిత "చివరకు మిగిలేది" అనే నవల రాసినటువంటి బుచ్చిబాబు గారు. ఇంతగా అంత చిన్న వయసు నుంచే పాటలు పాడడం అలవాటైంది టంగుటూరి సూర్యకుమారి గారికి. పాడడం అంటే మామూలుగా పాడడం కాదు ఏమాత్రం భయం లేకుండా ఎవరైనా "పాడు.." అంటే వెంటనే పాడేసేవాళ్ళు ఆవిడ.

చిన్నప్పట్నుంచి కూడా వాళ్ళ పెదనాన్న గారు అంటే టంగుటూరి ప్రకాశం పంతులు గారు బయటికెక్కడికైనా మీటింగులకి వెళుతుంటే ఈ పాపను తీసుకెళుతుండేవారు. బహుశా ఈవిడకి చిన్నప్పట్నుంచీ ఆ చొరవ, తెగింపు ధైర్యసాహసాలు, పట్టుదల ఇవన్నీ కూడా వాళ్ళ పెదనాన్న గారి దగ్గరినుంచి వచ్చినవని చెప్పుకోవచ్చు. అంత చిన్న వయసులో ఏమాత్రం భయం లేకుండా పాటలు పాడడం వచ్చినటువంటి టంగుటూరి సూర్యకుమారి గారు చిన్నతనంలో స్కూల్ కి వెళ్లిన దాఖలాలు ఎక్కడా లేవు. ఆవిడ అందరి లాగా స్కూల్ కి వెళ్లిపోయి ఒకటవ తరగతి, రెండో తరగతి చదువుకున్నట్లు ఎక్కడా కనిపించదు. కాకపోతే, వాళ్ళ నాన్నగారికి ఆంగ్ల భాషా ప్రావీణ్యం,అలాగే వాళ్ళ ఇంట్లో వాళ్ళ అక్కయ్యలు,అన్నయ్యలు చదువుకోవడం వీటన్నింటితోటి ఆవిడ బహుశా ఇంటివద్దనే చదువుకోవడం ప్రారంభించి ఉంటారని అనుకోవచ్చు.

ఆమెకి పెద్దక్కయ్య సావిత్రి గారికి చాలా అనుబంధం ఉంటూ ఉండేది చిన్నప్పట్నుంచే. అయితే టంగుటూరి సూర్యకుమారిగారికి ఆరేడు సంవత్సరాల వయసున్నప్పుడు సావిత్రి గారికి వివాహమైంది సూర్యప్రకాశరావు గారితో. వివాహమయ్యాక వాళ్ళు మద్రాసు వెళ్లారు.చిన్నప్పట్లోనే అంత వరకూ చాలా ప్రేమగా ఉన్నటువంటి అక్కయ్య మద్రాసు వెళ్లిపోయేసరికి ఈ టంగుటూరి సూర్యకుమారిగారు అంటే సూర్య ప్రకాశమ్మ అప్పట్లో.చాలా దిగులుగా ఉంటూఉండేది. వాళ నాన్నగారందుకని తరచూ ఆమెను మద్రాసు పంపిస్తూఉండేవాళ్లు అక్కయ్యగారి దగ్గరికి. అలాగ ఈ సూర్య ప్రకాశమ్మకి 12 సంవత్సరాల వయసున్నప్పుడు ఒకసారి మద్రాసు వాళ్ళక్కయ్యగారి ఇంటికెళ్ళారు. అప్పటికే సూర్యప్రకాశ రావు గారికి లాయర్ గా చాలా పేరుంది. చాలామంది సినిమావాళ్లు ఆయన దగ్గరికి క్లైంట్స్ గా వస్తూ ఉండేవాళ్ళు. ఒకరోజు అక్కయ్యగారి ఇంటిదగ్గరున్న ఈ సూర్య ప్రకాశమ్మ (12 సంవత్సరాల వయసు) బిగ్గరగా పాడుతోంది ఇంట్లో. బయట వాళ్ళ బావ గారు ఎవరో క్లైంట్స్ తో కూర్చుని ఉన్నారు. ఆయన హఠాత్తుగా ఉన్నట్టుండి "ఒకసారి ఇటురా" అని పిలిచారు.చాలా భయపడింది. బహుశా అందరితోటి మాట్లాడుతున్నారు నేను లోపలుండి పాడడం వల్ల ఆయనకి బాగా విసుగొచ్చిందేమో ఆయన పనిచెడిపోతుందేమో అనే కోపం తో పిలిచారని భయం భయంగా అక్కడికి వెళ్ళింది సూర్యప్రకాశమ్మ. ఎదురుగుండా కూర్చుని ఉన్నాయన " ఏది!

ఇందాక పాడుతున్న పాట మళ్ళాఒకసారి పాడు" అని అన్నారు. పాట పాడమంటే పాడేయటమే కానీ ఏమాత్రం భయం ఉండేది కాదుకదా.. అందుకని వెంటనే ఆవిడ ఏ పాట పాడుతుందో ఆ పాట పాడేశారు. " సర్లే వెనక్కెళ్ళు.." అన్నారు. అర్థంకాలేదు 12 ఏళ్ళ పాపకి.

ఆ తర్వాత రెండు మూడు రోజులకి తెలిసింది వాళ్ళ బావ గారి దగ్గర ఉన్నటువంటి క్లైంట్స్ ఒక తమిళ సినిమా నిర్మాణ సంస్థకు సంబంధించిన వాళ్ళు. వాళ్ళ సినిమాలో ఒక చిన్న పాప కోసం చూస్తున్నారు వేషం కోసమని. ఈ పాప సరిపోతుందని వాళ్ళు నిర్ధారించుకొని సూర్యప్రకాశరావు గారితో చెప్పి వెళ్ళారన్నమాట. ఆ విధంగా టంగుటూరి సూర్యప్రకాశమ్మ అనే పాపకి మొట్టమొదటి సారిగా ఒక తమిళ చిత్రంలో నటించే అవకాశం వచ్చింది 1937 లో. ఆ సినిమా పేరు విప్రనారాయణ. ఆ రోజుల్లో సినిమాల్లో నటించాలంటే పాటలు పాడగలిగి ఉండాలి. అందుకని ముందుగా పాటలు పాడటం వచ్చా లేదా అని చూసాక మాత్రమే వాళ్ళు తీసుకుంటూ ఉండేవాళ్ళు. విప్రనారాయణ షూటింగేమో కొల్హాపూర్ లో. అమ్మా నాన్న, చిన్నన్నయ్య రామ్మోహన్ ముగ్గురూ ఈ పాపను తీసుకుని కొల్హాపూర్ వెళ్లారు. అదేమో తమిళ సినిమా. పాపకి ఇంకా తమిళం సరిగ్గా రాదు. వాళ్ళు తెలుగులో రాసిస్తే , తమిళ సంభాషణలు చెపుతూ ఉండేవాళ్ళు. అప్పట్లో ముందుగా రికార్డింగ్ చేయడమనేది ఉండేది కాదు. షూటింగ్ జరుగుతున్నప్పుడే పక్కన ఆర్కెస్ట్రా ఉండేది. వీళ్ళు నటిస్తూనే పాడుతూ ఉండాలి. అలాగా పాడడంలో కూడా, ఏమాత్రం తడబాటు లేకుండా షూటింగ్లో నటిస్తూ, పాట పాడుతూ తనకిచ్చినటువంటి పాత్రకి న్యాయం చేకూర్చింది సూర్యప్రకాశమ్మ. ఆ సినిమా షూటింగులో ఉండగానే సూర్యప్రకాశమ్మ అన్న పేరుని సూర్యకుమారి అని మార్చారు. ఎవ్వరు మార్చారో ఇతమిద్దంగా తెలియదు. దగ్గరవాళ్ళందరూ సూర్య అని పిలుస్తూ ఉండేవాళ్ళు. అందులో ఆ పాప పాత్ర ఏమిటంటే – ఒక పూజారిగారుంటారు, పూజారిగారి కూతురు తల్లి చనిపోతుంది, సవతి తల్లి వస్తుంది , సవతి తల్లి బాగా ఇబ్బందులు పెడుతూ ఉంటుంది ఆ బాధలు భరించలేక ఈ భజనలు చేసుకుంటూ ఉంటుంది ఈ చిన్న పాప. ఆ పాత్ర సూర్యకుమారి గారు వేసింది. ఆ సవతి తల్లి బాధలు పెట్టేటటువంటి క్రమంలో నిజంగానే ఒక్కోసారి చెవులు మెలిపేయడం, వీపుమీద కొట్టడం ఇలాంటి పనులు చేసేది.ఈ పాపకేమో కళ్ళెంబట నీళ్ళొచ్చేసేవి గ్లిజరీన్ అవసరం లేకుండానే. షూటింగ్ అయిపోయాక "అమ్మా.. ఏం అనుకోవద్దు పొరపాటు చేసాను" అని ఆవిడ ఓదారుస్తూ ఉండేది. ఈ విధంగా విప్రనారాయణ తమిళ సినిమా షూటింగ్ జరిగింది.అది మొట్టమొదటి సినిమా టంగుటూరి సూర్యకుమారి గారికి.బాలనటిగానూ,గాయనిగానూ కూడా!

1937లో ఆ సినిమా అవ్వగానే ఆ మరుసటి సంవత్సరమే అంబికాపతి అని ఇంకొక తమిళ సినిమాలో వేషం వేసే అవకాశం వచ్చింది. ఆ సినిమా ఒకమాదిరిగా ఆడింది. విప్రనారాయణ తోనే "ఈ చిన్న పిల్లెవరో బాగుంది, బాగా పాడుతుంది" అని పేరు తెచ్చుకుంది. ఎలాగూ స్కూలుకెళ్ళలేదు, అందుకని మద్రాసులోనే ఉండిపోయింది. ఈ వేషాలు కొనసాగుతున్నాయి. రెండవ సంవత్సరంలోనే మూడవ సినిమాలో వేషం దొరికింది "అదృష్టం" అనే తమిళ సినిమాలో. అందులో పాత్ర ఈమెకు చాలా గొప్ప పేరు తీసుకొచ్చింది. అందులో ఏమిటంటే – చిన్న పిల్ల, చాలా ధనవంతురాలైన పిల్ల.. కాలక్రమేణా, కథాక్రమంలో అన్నీ పోగొట్టుకొని , వీధినపడి అడుక్కునేటటువంటి స్థితి వస్తుంది.ఆ పాత్రలో నటిస్తూ వీధిలో అడుక్కుంటూ ఓ పాట పాడుతుంది ఆ పాత్ర. అది సూర్యకుమారి గారికి విపరీతమైన పేరు తెచ్చి పెట్టింది.ఆ రోజుల్లో పాట "అయ్యా సిరిపెన్..." మార్మోగిపోయింది మద్రాసులో. ఈ పాప రోడ్ ల మీద అడుక్కుంటున్న దృశ్యాన్ని పెద్ద వాల్ పోస్టర్స్ లో వేసి అప్పట్లో బస్సులమీద కూడా అతికించారట. దాంతో తమిళ ప్రజలకే కాకుండా తెలుగు వాళ్లకు కూడా "మన తెలుగు పాప తమిళంలో బాగా నటిస్తోంది, పేరుతెచ్చుకుంటోంది" అన్నవిషయం తెలిసి పోయింది.

అదృష్టం అనే సినిమాల 1938లో వచ్చింది. దాని తర్వాత అదే సంవత్సరమో లేకపోతే ఒక సంవత్సరం తర్వాతో, జయప్రద అనే ఒక తెలుగు సినిమాలో ఒక చిన్న పాత్ర ధరించేటటువంటి అవకాశం వచ్చింది. టంగుటూరి సూర్యకుమారి గారికి అప్పటికి 14 సంవత్సరాల వయసు. ఆ సినిమా పెద్దగా ఆడలేదు, ఆమెకు కూడా పేరు పెద్దగా రాలేదు. దాని ప్రత్యేకత ఏమిటంటే, అది సాలూరి రాజేశ్వరరావు గారు సంగీత దర్శకత్వం వహించిన మొట్టమొదటి సినిమా.

దాని తర్వాత వచ్చింది టంగుటూరి సూర్యకుమారి గారిని ఈ రోజుకి కూడా సినీ అభిమానులు, అలాగే గాయని అభిమానులు కూడా గుర్తుబెట్టుకునేటటువంటి చిత్రం "రైతుబిడ్డ". ఆ సినిమా అప్పట్లో రకరకాల కోణాల్లో సంచలనాలను సృష్టించింది. ఆ సినిమా నిర్మాణంలో ఉండగా, అందులో ఒక బాలిక పాత్రకి ఎంపిక చేసుకున్నారు సూర్యకుమారి గారిని. రైతుబిడ్డ సినిమా తీసింది గూడవల్లి రామబ్రహ్మం గారు. ఆ సినిమా గురించి కూడా మనం లోగడ సమగ్రమైన కార్యక్రమం మాట్లాడుకున్నాం. ఆ చిన్న పాప తల్లిదండ్రులేవరంటే, బళ్ళారి రాఘవ గారని ఆ రోజుల్లో చాలా

ప్రసిద్ధమైనటువంటి రంగస్థల నటుడు.అలాగే ఆ బళ్ళారి రాఘవ గారి భార్య పాత్ర ధరించినావిడ పేరు కొమ్మూరి పద్మావతీ దేవి గారు. ఆ రోజుల్లో సినిమాలు అంటే చాల చిన్న చూపుండేది. అగ్రవర్ణాలకు సంబంధించిన వాళ్ళెవ్వరూ కూడా ముఖ్యంగా మహిళలు ఎవ్వరూ సినిమా రంగం వైపు వెళ్ళడానికి ఏమాత్రం ఆసక్తి చూపించేవాళ్ళు కాదు. వెళ్ళేవాళ్ళు కూడా కాదు. అలాంటి రోజుల్లో ఒక అగ్ర సామాజిక వర్గం నుంచి సినీరంగ ప్రవేశం చేసినటువంటి నటీమణి కొమ్మూరి పద్మావతి దేవి గారు. ఈ కొమ్మూరి పద్మావతి దేవి గారి అబ్బాయే ఆ తర్వాత రోజుల్లో ప్రముఖ డిటెక్టివ్ రచయిత కొమ్మూరి సాంబశివరావు గారు. సూర్యకుమారిగారిని ఈ సినిమాలో కాంట్రాక్టు రాయించుకున్నప్పుడు వాళ్ళు రాసినటువంటి ఒక ఉత్తరం నాకు దొరికింది.ఆ ఉత్తరం 1938 డిసెంబర్ 21 న రాశారు.దాంట్లో ఏం రాశారంటే, "Miss,Suryakumari alias T.Prakashamma,Triplicane , Madras . Madam , We acknowledge with thanks the receipt of your letter of even date and we hereby agree all the points mentioned there in ." అంటే ఈ రైతుబిడ్డ సినిమాలో చిన్నపాప పాత్ర అయినప్పటికీ ఈ ప్రకాశమ్మ గారి బావ గారు కానీ అక్కయ్య గారు కానీ వాళ్ళ అమ్మానాన్నలు గాని ఎలాంటి కండీషన్స్ పెట్టారో చూడండి.ఈ ఉత్తరంలో రాసిందేమిటంటే, "but , as regards item number 2 of your letter we can assure you there are no indecent talks or love portions. The story ends with a marriage in which the character is supposed to bride you may not actually take part in the marriage but it will be left suggestive . Thank you for Sarathi Films Business Director G.Ramabrahmam."

.ఆ విధంగా రైతుబిడ్డ సినిమాలో బాలనటిగా తెలుగు ప్రేక్షకులకి విస్తృతంగా పరిచయమయ్యారు టంగుటూరి సూర్యకుమారి గారు. ఇంకా ఆ సినిమాలో ఈవిడ నటించిన ధైర్యానికి ఉదాహరణాలేమిటంటే, ఆ సినిమాలో నటించిన వాళ్ళందరూ హేమాహేమీలు.కొమ్మూరి పద్మావతీదేవి గారు , బళ్ళారి రాఘవ గారు ,అలాగే సూరిబాబు గారు, గిడుగు సీతాపతి గారు.. వీళ్ళందరూ కూడా కాకలుతీరినటువంటి నటీనటులు. వాళ్ళందరి మధ్యన ఏ మాత్రం భయం లేకుండాగా నటించారు టంగుటూరి సూర్యకుమారి గారు. అందులో దాదాపుగా ఒక అరడజన్ పాటలు పాడారు. వాటిల్లో బాగా పేరు తెచ్చి పెట్టింది "హృదయము పొంగెనుగా, రావోయి వనమాలీ బిర బిర రావోయి, రాబోకురా రాబోకురా చందమామ" ఇలాంటి పాటలన్నీ కూడా ఆవిడ 13 ,14 సంవత్సరాల వయసులో పాడినవి. ఆ రోజుల్లో ఆంధ్రదేశాన్ని ఒక ఊపు ఊపేశాయి అని చెప్పడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు. అది 1939 లో విడుదలయింది.అంటే అప్పటికే ఆవిడ సినీ రంగ ప్రవేశం చేసి రెండు సంవత్సరాలయ్యింది, ఐదు సినిమాల్లో నటించింది, చిన్నవి గాని, పెద్దవి గాన.

ఇంకా అక్కడినుంచి వరుసనే ఆమెకు సినిమాల్లో అవకాశాలు వచ్చాయి. అప్పటికి ఆవిడ మామూలు చదువూ చదువుకోలేదు, అలాగే సంగీతం కూడా తనంతట తనే నేర్చుకున్నది కానీ ఎవ్వరిదగ్గర కూడా సశాస్త్రీయంగా నేర్చుకోలేదు. ఇక్కడి నుంచి ప్రారంభించి.. ఆవిడ ఒక వైపు సినిమాల్లో నటిస్తూ, సంగీత శిక్షణ కూడా తీసుకుంటూ కొనసాగారు.ఇది 1939,40 అంటే ఆవిడకు 14, 15 సంవత్సరాల వయసు.ఈ ఒక్క సినిమా తోటే ఆవిడ ఎంత సెలెబ్రిటీ హోదా తెచ్చుకున్నారంటే,1940 లో వచ్చినటువంటి గృహలక్ష్మి అనే ప్రతిష్ఠాత్మకమైన పత్రికలోఒక వ్యాసం రాస్తూ ఆవిడని ఇలా వర్ణించారు."ఉత్తమ కుల కన్య,నృత్య గాన కళా పిపాస ,ఆదర్శ భావ పూరిత" అని ఇలా వర్ణిస్తూ 15 సంవత్సరాల పాప గురించి ఆ రోజు ఆ పత్రికలో ఒక విస్తృతమైనటువంటి వ్యాసాన్ని ఘనంగా పొగడుతూ రాశారు. అప్పటికే ఆవిడ "కాంగ్రెస్ జెండా.. పావన హిందూ మాత" అనే దేశభక్తి గీతాలు కూడా పాడుతూ ఉండేవాళ్ళు. రైతుబిడ్డ సినిమా పూర్తయ్యాక వెంటనే వచ్చినటువంటి చిత్రం సుమంగళి. దాంట్లో పెద్ద పాత్రమీ కాదు, పెద్ద పేరూ తెచ్చి పెట్టలేదు. రైతుబిడ్డతో పోటీగా పేరు తెచ్చిపెట్టినటువంటి తర్వాతి చిత్రం "దేవత", నాగయ్య గారు నటించినటువంటి చిత్రం. ఆ సినిమాలో టంగుటూరి సూర్యకుమారి గారు కాస్త పెద్ద పాత్ర ధరించారు. అందులో కూడా దాదాపు గా 10 పాటలు పాడారు. ఏడెనిమిది పాటలు విపరీతమైన ప్రజాదరణ పొందాయి. ఆ దేవత సినిమా తో టంగుటూరి సూర్యకుమారి అనేటటువంటి బాలనటి, అన్ని రకాల పాత్రలు ధరించగలిగే నటి ఉన్నారని సినిమా రంగానికి తెలిసింది. అక్కడినుంచి దాదాపుగా ఆ తర్వాత మూడు సంవత్సరాల్లోనే అంటే మొత్తం ఆవిడ సినీ రంగ ప్రవేశం చేసిన ఆరు సంవత్సరాల్లోనే 14 సినిమాల్లో నటించారు. నటిస్తూ, పాటలు పాడుతూ మళ్ళా బయట పాటలను నేర్చుకుంటూ స్వాతంత్ర్య గీతాలు పాడుతూ ఇలా కొనసాగింది ఆరు సంవత్సరాలు. ఆవిడ అతి చిన్న వయసులోనే సెలెబ్రిటీ హోదాని తెచ్చుకున్నారు.

దేవత సినిమా తర్వాత మళ్ళీ ఒక తమిళ సినిమా ప్రేమబంధ అనే దాంట్లో అవకాశం వచ్చింది. ఆ రోజుల్లోనే మహాత్మాగాంధీ గారి మీద ఒక చిన్న డాక్యుమెంటరీ , బయోగ్రఫీ లాంటి సినిమా తీశారు.దాని పేరు మహాత్మాగాంధీనే తెలుగులో. అది ఒక డాక్యుమెంటరీ లాగా ఉంటుంది సినిమా

లాగానూ ఉంటుంది. అంటే అప్పట్లో ఉన్న మహాత్మాగాంధీ గారికి సంబంధించిన క్లిప్పింగ్స్ అవన్నీ కలిపి తీశారు. దాంట్లో కూడా పాటలు పాడారు టంగుటూరి సూర్యకుమారి గారు. ఆ తర్వాత భక్తపోతన అనే సినిమాలో, పాటలూ పాత్ర ఏమీ లేదు గాని, కేవలం ఒకే ఒక షాట్ ఉంటుంది.సరస్వతి దేవి పాత్రలో, భక్తపోతన లో బహుశా నాగయ్య గారి కోసం నటించి ఉంటారు.

తర్వాతి సంవత్సరమే 1942 లో వచ్చింది "దీనబంధు" అనే సినిమా. ఈ సినిమాకి చాల ప్రత్యేకత ఉంది. ఏంటంటే,ఈ దీనబంధు చిత్రం కోసమనే మా తెలుగు తల్లికి మల్లెపూదండ అనే పాట వ్రాయించారు అని కొంతమంది చెబుతూ ఉంటారు. ఆ సినిమాలో అయితే ఆ పాట లేదుకానీ ఆ సినిమాలో పాటలు రాసినాయన శంకరంబాడి సుందరాచారి గారు. దీనబంధు సినిమాలో పాటలన్నీ ఆయనే రాశారు. అందులో దాదాపుగా ప్రతి పాట కూడా టంగుటూరి సూర్యకుమారి గారు పాడారు, అందులో నటించారు కూడాను. బహుశా అప్పట్లో శంకరంబాడి సుందరాచారి గారు రాసినటువంటి ఈ మా తెలుగు తల్లికి మల్లె పూదండ సినిమాలో వాడకపోవడం మూలాన, ఈవిడ బయట రికార్డు ఇచ్చి ఉండాలి. అప్పట్నుంచి ఆ పాట విపరీతంగా ప్రాచుర్యంలోకి వచ్చింది. ఆ తర్వాత రెండు సంవత్సరాలు వచ్చిన రెండు మంచి సినిమాలు , ఆ తర్వాత టంగుటూరి సూర్యకుమారి గారి జీవితం ఎలాంటి మలుపులు తీసుకుంది, ఆవిడ ఎన్ని ఘనమైన కార్యక్రమాలు, గుర్తుపెట్టుకోదగ్గ కార్యక్రమాలు, మనమందరం కూడా ఆవిడని ప్రశంసించవలసినట్టి కార్యక్రమాలు, సాంఘీక సేవా విషయాలు ఇలాంటివన్నీ ఆవిడ గాయనిగానే ఉంటూ,ఎలా కొనసాగించారు ఈ విశేషాలన్నీకూడా టంగుటూరి సూర్యకుమారి గారి గురించిన ప్రత్యేక కార్యక్రమం రెండవ భాగంలో మాట్లాడుకుందాం.

**(ఆడియో టాక్ షో కి అక్షరరూపం ఇచ్చినవారు – శ్రీ బొడ్డు సత్యనారాయణ)**

(సశేషం)

★★★

2018 ఏప్రిల్ 3 న ప్రసారమైన ఈ టాక్ షోని ఇక్కడ వినవచ్చు

COMMENTS